వీధి కుక్కల స్వైరవిహారం

- గొర్రెల మందలపై దాడులు
- వాహనదారులను వెంబడిస్తూ భయపెడుతున్న వైనం



చిలుకూరులో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

మొయినాబాద్: వీధికుక్కలు గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా ఒక్కచోట చేరి వాహనదారులను వెంబడిస్తూ భయపెడుతున్నాయి. గొర్రెల మందలపై దాడి చేసి చంపేస్తున్నాయి. మొయినాబాద్ మండల కేంద్రంతో పాటు చిలుకూరు, పెద్దమంగళారం, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మేడిపల్లి, సురంగల్, శ్రీరాంనగర్, కనకమామిడి, వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వీధికుక్కల బెడద తీవ్రమయింది. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ వచ్చి పోయే ద్విచక్రవాహనదారుల వెంట పడుతున్నాయి. దీంతో వాహనదారులు భయాందోళనకు గురై అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నారు. మరోవైపు గొర్రెలు, మేకల మందలపై దాడులు చేసి వాటిని చంపేస్తున్నాయి. ఇటీవల కేతిరెడ్డిపల్లి, నాగిరెడ్డిగూడ, అమ్డాపూర్, సురంగల్ తదితర గ్రామాల్లో గొర్రెల మందలపై కుక్కలు దాడి చేసి వందల సంఖ్యలో జీవాల ప్రాణాలు తీశాయి. రోడ్లపై నడుచుకుంటూ వెళ్లే వారిపై, చిన్నారులపై దాడులు చేసి కరుస్తున్నాయి.

నగరం నుంచి గ్రామాలకు

హైదరాబాద్ నుంచి వీధికుక్కలు తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల్లో వదులుతున్నారు. దీంతో ఇటీవల కాలంలో గ్రామాల్లో వీధికుక్కలు ఎక్కువయ్యాయి. ఒక్కో గ్రామంలో సుమారు 100-200 వరకు వీధికుక్కలు ఉన్నాయి. కుక్కలు రోడ్లపై తిరుగుతుండడంతో వాహనదారులతోపాటు, నడుచుకుంటూ వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ పాలకవర్గాలు, పంచాయతీ అధికారులు వీధికుక్కలను పట్టించుకోవడంలేదు. రోజురోజుకు కుక్కల పెరుగుతున్నా వాటిని నియంత్రించే చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని వీధి కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాల్లో వదిలేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తొమ్మిదేళ్లుగా మోసమే మిగిలింది

టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్

మొయినాబాద్ రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా తొమ్మిదేళ్లుగా ప్రజలను మోసం చేస్తోందని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్ ఆరోపించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నక్కలపల్లి నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన దర్శన్ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటర్లే తగిన గుణపాఠం చెబుతారన్నారు. యువతకు యూత్ డిక్లరేషన్‌లో పొందుపరిచిన ప్రతీ ఒక్క హామీని అధికారంలో వచ్చిన వెంటనే నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, సహకార సంఘం మండల చైర్మన్ చంద్రారెడ్డి, ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, తోల్‌కట్ట మాజీ సర్పంచ్ సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, టీపీసీసీ మైనార్టీ కోఆప్షన్ సభ్యులు ఖాజాపాషా, ఎత్‌మార్‌పల్లి ఉపసర్పంచ్ భిక్షపతి, నాయకులు జంగారెడ్డి, కేబుల్ రాజు, మర్రి రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, మధు, విష్ణువర్ధన్‌రెడ్డి, సాయికుమార్, నర్సింహారెడ్డి, కృష్ణ, బుచ్చయ్య, అరవింద్, ప్రవీణ్, రాజేశ్, శ్రీకాంత్, గణేశ్, మల్లేశ్, మధుసూదన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షాబాద్ దర్శన్

క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి



మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

షాద్‌నగర్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్, గంట్లవెల్లి, దేవునిబండ తండా గ్రామాల్లో హరితహారం కార్యక్రమం చేపట్టారు. మధురాపూర్‌లో రూ.5లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ మాట్లాడుతూ.. హరితహారంలో కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలన్నారు. మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, సర్పంచ్, శివారెడ్డి, యాదమ్మ, యాదయ్య, మధులత, నాయకులు మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యోదయ కార్డులివ్వండి

ఎన్‌పీఆర్డీ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

షాద్‌నగర్‌రూరల్: అంత్యోదయ కార్డులను మంజూరు చేయాలని కోరుతూ దివ్యాంగులు సోమవారం ఆర్డీఓ వెంకటమాధవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్డీ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు చెందిన తాము వైకల్యంతో పనులు చేసుకోలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ సరిపోక అర్ధాకలితో అలమటిస్తున్నామని వాపోయారు. కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులకు, నాయకులు వినతులిచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు అంత్యోదయ కార్డుల మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, సుగుణమ్మ, పార్వతమ్మ, మంజుల, చెన్నయ్య, అంజయ్య, రామాంజనేయులు, పాపయ్య, నర్సింలు, గోపాల్, మహేశ్, కృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ఎద్దును కళేబరాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: పొలాల్లో వేలాడుతున్న విద్యుత్‌వైర్లు తగిలి ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బజారు కృష్ణ తన పొలంలో ఎద్దును మేపుతుండగా విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు తగిలి అక్కడికక్కడే ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ రూ.70 వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ శోభారెడ్డి ఘటనాస్థలిని పరిశీలించి విద్యుత్‌అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందనిఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా బాధితుడిని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ సిద్ధయ్య పరామర్శించారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ కో ఆర్డినేటర్ టీవీ రంగయ్య



మాట్లాడుతున్న టీవీ రంగయ్య

షాద్‌నగర్‌రూరల్: ప్రతీ ఒక్కరు దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించుకోవాలని సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ కో ఆర్డినేటర్ టీవీ రంగయ్య అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులుగా కళాజాత బృదంతో గ్రామాల్లో మేరీ మట్టి..మేరీ దేశ్ కార్యక్రమంపై కళాప్రదర్శనలు నిర్వహించారు. సోమవారం ముగింపు ఉత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంకోసం ప్రాణాలను అర్పించిన అమర జవాన్ల త్యాగాలను మరువలేమన్నారు. దేశాభివృద్ధిని కాంక్షించి దేశంకోసం ప్రాణాలర్పించిన అమర వీరులను స్మరించుకోవడం, సన్మానించుకోవడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, శ్రీనివాస్, రమేష్‌చారి, శివ, రంగ, నర్సింహ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాదాసి మదారి కురువలకు సహకారం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మాదాసి మదారి కురువల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను ఆ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. మాదాసి మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మె సంతోష్ మాట్లాడుతూ.. మాదాసి మదారి కురువలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను అందించడంలో జాప్యం జరుగుతోందన్నారు. పదేళ్లగా సమస్యలపై పోరాడుతూ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని సైతనం బహిష్కరించామన్నారు. ఈ క్రమంలో తమ సమస్యపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించడం హర్షనీయమన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్సీ ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో మేనిఫెస్టో కమిటీ చైర్మెన్ కేశవరావు, సీఎస్‌ను కలిశామని.. అయినప్పటికీ ధ్రువీకరణ పత్రాలు రాకపోవడంతో అసెంబ్లీలో ప్రస్తావించానన్నారు. మాదాసి మదారి కురువలకు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శ్రీనాథ్, సుధాకర్, కుమార్, జగన్, నవీన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులు కష్టపడితే అధికారం

- రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది
- నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి
- స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్



కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కేఎల్ఆర్

షాబాద్: వంద రోజులు కష్టపడి పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్), మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. ప్రజా ఆకాంక్షలు గుర్తించిన సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపు కాంగ్రెస్‌దే అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సర్వేలు, ప్రజా ఆదరణ ఆధారంగానే పార్టీ అభ్యర్థులను ఖరారు చేస్తోందన్నారు. అధిష్ఠానం ఎంపిక చేసిన అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వందరోజులు తాము నియోజకవర్గాల పరిధిలోనే పర్యటిస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని చెప్పారు.

ముగ్గురిలో ఎవరికి ఇచ్చినా ఓకే

స్థానికులకే టికెట్ ఇవ్వాలని టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహన సభ్యుడు పామెన భీంభరత్, టీపీసీసీ మెంబర్ షాబాద్ దర్శన్, సీనియర్ నాయకుడు సున్నపు వసంతం కోరారు. మా ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేసి చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వరంగల్ డిక్లరేషన్ అమలు చేస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా, పార్టీ ప్రధాన కార్యదర్శి పామెన భార్గవరామ్, చేవెళ్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శేరి పెంటారెడ్డి, పార్టీ చేవెళ్ల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మొయినాబాద్ మండల అధ్యక్షుడు పార్టీ అధ్యక్షులు మానెయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రామ్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పెంటయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, చెన్నయ్య, బుచ్చయ్య, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘డబుల్’ ఇళ్లు ఇవ్వండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య



వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: అర్హులందరికీ ప్రభుత్వమే డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం పేరిట రూ.3లక్షలు చేతులు దులుపుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తు చేసుకునేందుకు మరో పదిరోజులు గడువుల పెంచాలని కోరారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ పేదలకు అందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి గృహలక్ష్మి పథకం పేరిట మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పంచాయతీ కార్యదర్శులతో సర్వే చేయించి అర్హులను ఎంపిక చేయాలన్నారు. గృహలక్ష్మి పథకానికి ప్రభుత్వం గడువు పెంచని ఎడల పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రమేశ్‌యాదవ్, నాయకులు కేశవులు, నర్సింలు తదితరులున్నారు.

ప్రతీ ఇంటిపై జెండా ఎగరాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రజలందరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని అన్నారు. దేశంకోసం ప్రాణాలర్పించిన అమర జవాన్లను స్మరించుకోవాలని సూచించారు. అనంతరం అందె బాబయ్య మాట్లాడుతూ.. దేశాన్ని నడిపించే జవాన్, కిసాన్‌ను మరువొద్దన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా మాట్లాడుతూ.. యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వంశీకృష్ణ, రుషికేష్, నాగరాజుచారి, సుధాకర్ అప్ప, కుర్మయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, చెట్ల వెంకటేష్, మల్చాలం మురళి, శ్రావణ్, మోహన్‌సింగ్‌నాయక్, లష్కర్‌నాయక్, విస్తారక్, సాయిబాబగౌడ్, కాసోజుశివ, శ్యాంసుందర్, మురళీధర్, సురేశ్, రఘుగౌడ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘బూత్ మేళా’ను విజయవంతం చేయండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్



పార్టీ కార్యాలయంలో సమావేశమైన బీజేపీ నేతలు

షాబాద్: నియోజకవర్గ కేంద్రం చేవెళ్లలో ఈ నెల 21న నిర్వహించనున్న బీజేపీ బూత్ మేళాను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి, నియంత పాలన, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు అభ్యర్థించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు చేరకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, ప్రధాన కార్యదర్శి సురేశ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మాణెయ్య, యువ మోర్చా జిల్లా కార్యదర్శి మహేందర్, నాయకులు రవీందర్ రెడ్డి, శ్రీశైలం, ప్రశాంత్, వినయ్, సందీప్, శివారెడ్డి, రవిగౌడ్, మహేశ్, అరుణ్, రవీందర్, విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



నియామకపత్రం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడలో పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రంగంపల్లి సురేశ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భిక్షపతి యాదవ్, ఉపాధ్యక్షులుగా చందుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా రవిగౌడ్, కోశాధికారిగా గణేశ్, సహాయ కోశాధికారిగా కృష్ణ, సభ్యులుగా మల్లేశ్, శివకుమార్‌గౌడ్, బాలరాజు, యాదయ్య, రమేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫకీర్ పాషా, వెంకటేశ్‌గౌడ్, మల్లేష్ యాదవ్, గణేశ్, జి.రమేశ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, యాసిన్, భీష్మ రమేశ్, శేఖర్, రాఘవేందర్, రాజు, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఆశీర్వాదమే కొండంత అండ

పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



చీరలను పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: మీ ఆశీర్వాదం, అభిమానమే నాకు కొండంత అండ అని పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పులుసుమామిడి, విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల, ఉమ్మెంత్యాల గ్రామాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న విష్ణు అన్న రాఖీ రక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు 1,500 చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలకోసం ఎన్ని కార్యక్రమాలను నిర్వహించడానికైనా సిద్ధంగా ఉన్నానన్నారు. రాఖీ పండుగ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు జరుపుకునే గొప్ప పండుగ అన్నారు. కానీ భూ తగాదాలు, ఆస్తి పంపకాలలో ఏర్పడుతున్న విభేదాలతో బంధాలు, బంధుత్వాలు విడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి ప్రజలంతా తమ బంధువులతో సంతోషంగా పండుగలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, విజయభాస్కర్, ఆకుల ప్రదీప్, బోయ అశోక్, గోపాల్, చంద్రశేఖర్, కాటం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం లేక అవస్థలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ధర్నాలో బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ ఆమనగల్లు పట్టణంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రం సాంకేతిక సమస్యలతో మూసివేశారని, అప్పటి నుంచి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆమనగల్లులో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తే ఆమనగల్లు మండలంతో పాటు కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల ప్రజలకు ఇబ్బందులు తీరుతాయన్నారు. అనంతరం తహసీల్దార్ లలితకు బీజేవైఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు సాయి ఉన్నారు.

గుండెపోటుతో సేల్స్‌మెన్ మృతి



బండి శ్రీనివాస్ (ఫైల్)

చేవెళ్ల: గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్(35) సేల్స్‌మెన్‌గా, పేపర్ ఏజెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధి బుద్వేల్‌లో నివాసం ఉంటున్న ఆయన సోమవారం విధులకు వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు.